క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆర్మూర్‌టౌన్: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధు లపై అప్రమత్తంగా ఉండా లని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్ట ణంలోని పలు వార్డుల్లో సోమవారం ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరి సరాలను పరిశుభ్రం ఉంచాలని కోరారు. మున్సిపల్ అధికారులు గజానంద్, పూర్ణహాళి, అవినాష్, చక్రధర్, భాజన్న, శంకర్ ఉన్నారు.

యుద్ధాలు శాంతికి విఘాతం



ఆర్మూర్‌టౌన్: యుద్ధాలు ప్రపంచశాంతికి విఘాతం కలిగిస్తాయని సీపీఎం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకటరాములు అనానరు. ఇటీవల ఉగ్ర దాడిలో మరణించిన ప్రజలకు, వీరజవాన్లకు సోమవారం ఆర్మూర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నివాళులు అర్పిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు వెంకటేష్, సాయి, ఓంకార్, లాల్యానాయక్, గణేష్, కలీం తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



బోధన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరంత తహసీల్దార్ దత్తాద్రికి వినతిపత్రం అందించారు. ఏఐయూకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, నాయకులు నడ్పి నాగన్న, పార్వతి రాజేశ్వర్, షేక్ నసీర్, రవి, మల్లేష్, సుదర్శన్, హన్మాండ్లు, వైద్యనాథ్, పోశెట్టి, కొండ్ర లక్ష్మణ్ పాల్గొన్నారు.

తప్పుడు లెక్కలు చూపిస్తే రికవరీ చేస్తాం



వర్ని: ఉపాధి హామీ పనుల్లో తప్పుడు లెక్కలు చూపిస్తే సంబంధిత అధికారుల నుంచి అందుకు సంబంధించిన డబ్బులను రికవరీ చేసి, శిక్ష, జరిమానా విధిస్తామని డీఆర్డీఏ పీడీ సాయిగౌడ్ హెచ్చరించారు. మోస్రా మండల ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్‌ను సోమవారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజావేదిక నిర్వహించిన ఆడిట్ టీం వివరాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో కూలీలు పనులకు రాకున్న తప్పుడు హాజరు వేసి డబ్బులను కాజేసినట్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అంబర్‌సింగ్, డీఆర్పీ దేవేందర్ పాల్గొన్నారు.

కేంద్ర వైఖరి తెలియజేయాలి



ఆర్మూర్: ఇరాన్–ఇజ్రాయిల్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తెలియజేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరాన్, ఇజ్రాయిల్ తాజా పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి భద్రత మండలిని అత్యవసరంగా సమావేశపరిచి యుద్ధాన్ని నివారించాలన్నారు. నాయకులు దేవరాం, కిషన్, రాజన్న, రవి, శ్రీనివాస్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 2,065 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 261 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1063.60(14.36 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

గదుల కొరత.. వసతులు కరువు

- సాలూరలోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ఇబ్బందులు
- చెట్ల నీడన, వరండాల్లో పాఠాల బోధన
- పట్టించుకోని అధికారులు



సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో చెట్ల నీడన విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

బోధన్: సాలూర మండల కేంద్రంలోని ప్రభుత్వ బడుల్లో తరగతి గదుల కొరతతోపాటు, కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు.

ఇదీ పరిస్థితి..

సాలూరలో జెడ్పీహెచ్ఎస్, రెండు ప్రాథమిక పాఠశాలలు, ఒక ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. జెడ్పీహెచ్ఎస్‌లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు సుమారు 300 వరకు ఉంటారు. సబ్జెక్టుల బోధనకు 17 మంది ఉపాధ్యాయులున్నారు. పాఠశాల భవనంలో మొత్తం 9 గదులుండగా, మూడింటిని కంప్యూటర్, సైన్స్‌ల్యాబ్, టీచర్స్ స్టాఫ్ రూంకు కేటాయించారు. మరో గదిని ఎంఈవో ఆఫీస్‌కు ఇచ్చారు. మిగిలిన ఐదు గదుల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియం రెండు సెక్షన్స్ తరగతులు నిర్వహణకు ఇబ్బందిగా మారింది. దీంతో రెండు తరగతుల విద్యార్థులకు పాఠశాల ఆవరణలోని చెట్ల నీడన పాఠాలు బోధిస్తున్నారు. మరో మూడు తరగతులను డైనింగ్ హాల్‌లో నిర్వహిస్తున్నారు. ఉన్న గదుల్లో నాలుగు శిథిలావస్థకు చేరడంతో సామగ్రి నిల్వకు వాడుకుంటున్నారు. గదుల కొరత విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతోంది. ఈ పాఠశాలలో మరో ఆరు కొత్త గదులు నిర్మించాల్సిన అవసరం ఉంది.



ఉర్దూమీడియం పాఠశాలలో వరండాలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న టీచర్

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనంలో నాలుగు గదులు ఉండగా, 140 మంది విద్యార్థులు, ఐదుగురు టీచర్లు ఉన్నారు. ఇందులో గదుల కొరత వల్ల ఒక తరగతిని టీచర్స్ స్టాఫ్ రూంలో, మరో తరగతిని వరండాలో నిర్వహిస్తున్నారు.

ఉర్దూమీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు 90 మంది విద్యార్థులు ఉండగా, నలుగురు టీచర్లు ఉన్నారు. పాఠశాల భవనంలో ఐదు గదులున్నాయి. హెచ్ఎం, టీచర్స్ స్టాఫ్ రూంలోనే ఒక తరగతిని, మరో రెండు తరగతులను వరండాలో నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి, బడుల్లో అదనపు తరగతి గదులు నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

రుద్రూర్ మండలంలో..

రుద్రూర్: మండలంలో 14 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 4 జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉన్నాయి. మండల కేంద్రంలోని హరిజనవాడ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడం వల్ల పక్కనే ఉన్న సంస్కార్ భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ఇద్దరు మహిళ టీచర్లు, 21 మంది విద్యార్థులు ఉన్నారు. జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నందున పాఠశాలకు చెందిన టాయిలెట్స్, వంట గదిని కూల్చేశారు. దీంతో విద్యార్థులు, మహిళ టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రుద్రూర్ జవహర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 55 మంది విద్యార్థులు ఉన్నారు. కానీ టాయిలెట్స్ లేవు. కోటగిరి మండలం లింగాపూర్, పోతంగల్ మండలం కొల్లూర్ ప్రాథమిక పాఠశాలలను గ్రామ పంచాయతీకి చెందిన గదుల్లో కొనసాగిస్తున్నారు. రెండేళ్ల క్రితం తరగతి గదుల నిర్మాణం కోసం పాత గదులు కూల్చి వేశారు. ఇప్పటికీ నిర్మాణం పూర్తికానందున విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆయా పాఠశాలల్లో టాయిలెట్స్ సౌకర్యం కల్పించాలని, అదనపు తరగతి గదులు నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన రుద్రూర్‌లోని హరిజనవాడ పాఠశాల భవనం



టాయ్‌లెట్స్ లేని జవహర్ నగర్ ప్రాథమిక పాఠశాల

ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం..

జెడ్పీహెచ్ఎస్‌లో ప్రధానంగా గదుల కొరత సమస్య తీవ్రంగా ఉంది. మరో నాలుగు అదనపు గదుల మంజూరుకు ప్రతిపాదనలు ఉన్నాయి. గదుల కొరత సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. అదనపు గదులు సమకూరితే బోధనకు మరింత సౌకర్యం కలుగుతుంది.

– రాజీ మంజూష, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం, ఎంఈవో, సాలూర మండలం

ప్లాస్టిక్ కవర్స్.. పిట్ట బెదుర్స్



బాల్కొండ: నారు మడిలో విత్తన గింజలు పిట్టలు ఎత్తుకెళ్లకుండా బెదరాలంటే ప్లాస్టిక్ కవర్స్‌ను బెదరుగా కట్టాలని నాగాపూర్ గ్రామానికి చెందిన రైతులు అంటున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి నాట్లు వేయుట కోసం నారు మడులు సిద్ధం చేశారు. పిట్టల బారి నుంచి కాపాడుకోవడం కోసం మడి మొత్తం ప్లాస్టిక్ కవర్లు కట్టారు. గాలికి కవర్లు శబ్దం చేయడంతో పిట్టలు బెదురుతాయని రైతులు పేర్కొంటున్నారు. దీంతో రోడ్డు గుండా వెళ్లే వారు వాటిని ఆశ్చర్యంగా చూస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



రుద్రూరు: కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకు సోమవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ హనుమంతు, శంకర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈఈ నితీష్

బాల్కొండ: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల్లో వేగం పెంచాలని బాల్కొండ ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, హౌసింగ్ ఏఈఈ నితీష్ అన్నారు. బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు మార్కింగ్ ఇవ్వని ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను వెంటనే మార్కింగ్ ఇవ్వాలన్నారు. ఎంపీవో గంగామోహన్, తదితరులు పాల్గొన్నారు.



వేంపల్లిలో ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

ఇంటి నిర్మాణాల పరిశీలన

బాల్కొండ: ముప్కాల్, వేంపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను ముప్కాల్ ఎంపీడీవో నరేశ్ ఆనంద్ ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఎంపీవో గౌస్ మొయినొద్దీన్, సభ్యులు తదితరులు ఉన్నారు.

పిల్ల కాలువకు మరమ్మతులు చేయిస్తా



మాక్లూర్: నిజాంసాగర్ ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న రామచంద్రపల్లిలోని పిల్ల కాల్వకు మరమ్మతులు చేయించి త్వరలో అందుబాటులోకి తెస్తానని ఇరిగేషన్ డీఈ కృష్ణమూర్తి అన్నారు. గ్రామంలోని పిల్ల కాలువను సోమవారం ఆయన సర్వేయర్‌తో కలిసి పరిశీలించారు. గ్రామానికి చెందిన మురుగునీటి కాలువల నీరుతో పాటు కొంత కబ్జాకు గురికావటం వల్ల పిల్ల కాలువ పూడుకపోయినట్టు గుర్తించారు. పక్షం రోజుల్లో కాల్వకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెప్పిస్తానని అక్కడున్న రైతులకు హామీ ఇచ్చారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి





వర్నిలో మాట్లాడుతున్న బోధన్ జడ్జి సాయి శివ.. పెర్కిట్ మోడల్ స్కూల్‌లో..

వర్ని: యువత చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బోధన్ కోర్టు జడ్జి సాయి శివ వెల్లడించారు. మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో సోమవారం ఆయన డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలుగు అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో మత్తు పదార్థాలను వాడినా, కలిగి ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని ఆయన తెలిపారు. యువత ఈ విషయంలో జాగ్రత్తగా ఉండి అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు. వర్ని ఎస్సై మహేష్, ఎంఈవో సాయన్న పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మోడల్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై ఉజ్వల భవిష్యతును పాడు చేసుకోవద్దన్నారు. తల్లితండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మంచిని గ్రహించి మసలుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ శ్యామ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, నళిని, షీ టీం సుమతి, సౌమ్య, పుష్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్టు శాఖ అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో పద్మ మాట్లాడుతూ.. యువత మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దన్నారు. అంతకుముందు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి, షార్ట్ ఫిలిం ద్వారా అవగాహన కల్పించారు. డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా కో–ఆర్డినేటర్ పిట్ల స్వప్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక రాథోడ్, నందిని, ఆసియా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



ఆర్మూర్‌లో నివాళులు అర్పిస్తున్న బీజేపీ శ్రేణులు



పోతంగల్ మండల కేంద్రంలో..

ఆర్మూర్: జాతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆర్మూర్‌లో బలిదాన్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, బీజేపీ నాయక లు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందుత్వ పార్టీని స్థాపించిన మహనీయుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం పని చే స్తామని అన్నారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జెస్సు అనిల్, గంగాధర్, తిరుపతి నాయక్, ప్రశాంత్, విజయ్ ఆనంద్, రాజు, జాగిర్దార్ శీను, దొండి ప్రకాష్, పాన్ శీను, రంగన్న పాల్గొన్నారు.

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు హన్మండ్లు, మక్కన్న, నాగం సాయిలు, అశోక్, వెంకన్న పాల్గొన్నారు. రుద్రూర్‌లో బీజేపీ నాయకులు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన జ్ఞాపకార్థం మొక్కలు నాటారు. ప్రకాష్ పటేల్, ప్రశాంత్ గౌడ్, వినోద్ కుమార్, అనిల్, గణేష్, సందీప్, సాయి పాల్గొన్నారు.

వేల్పూర్ మండలంలో..

వేల్పూర్: మండలంలోని కుకునూర్ గ్రామంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్‌ను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బేల్దారి నవీన్, భానుచందర్, రాకేశ్, నీలేందర్, ర్యాడ శీను, రాజేందర్ పాల్గొన్నారు.



కుకునూర్‌లో..

ఆధ్యాత్మికం..

- శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నందీశ్వర మహారాజ్ సమక్షంలో స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. సుమన్, పీసీ గంగారెడ్డి, మల్లయ్య, కొంత మంజుల, చరణ్‌రెడ్డి, జిమ్మిరవి తదితరులు పాల్గొన్నారు.

- గ్రామ దేవతలకు జలాభిషేకం

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో సోమవారం గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. గ్రామస్తులు ఉదయం గోదావరికి కాలినడకన వెళ్లి గంగనీళ్లను వల గొడుగు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకు వచ్చారు. అనంతరం గ్రామంలోని కోదండరామాలయం, నరసింహస్వామి, తాతాయి, పోశమ్మ, హనుమాన్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో జలాభిషేకాలు నిర్వహించారు. వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పడిలేచిన మర్రి చెట్టు వార్షికోత్సవం



పడిలేచిన మర్రి చెట్టు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం శివారులోని గుండెవాగు ప్రవహించే ప్రాంతంలో పడిలేచిన మర్రి చెట్టు 20వ వార్షికోత్సవం నేడు నిర్వహించనున్నట్లు వీడీసీ ప్రతినిధులు సోమవారం తెలిపారు. ప్రకృతి వైపరిత్యాల కారణంగా తీవ్రమైన గాలి, వర్షానికి జనవరి 28, 2005లో ఈ మర్రిచెట్టు వేళ్లతో సహా నేలకొరిగింది. కానీ జూన్ 24, 2005న ఎలాంటి మానవ ప్రయత్నం లేకుండానే యథాస్థానంలో మర్రి చెట్టు నిలిచింది. అదే సమయంలో ఆ ప్రాంతంలో శివలింగేశ్వరా స్వామి వెలిశాడు. దీంతో అప్పటి నుంచి పడిలేచిన మర్రి చెట్టు శివలింగేశ్వరా స్వామిగా పూజలు అందుకుంటుంది. మర్రి చెట్టు దర్శనానికి వచ్చిన ప్రతి ఒక్కరూ కొబ్బరి కాయ ముడుపు కట్టనిదే కదలరు. అలా చెట్టు వద్ద కొబ్బరి ముడుపులతో నిండిపోయింది. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు, అన్నదానం నిర్వహించబడుతున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

సంక్షిప్తం

నియామకం



దొంకేశ్వర్(ఆర్మూర్): బీజేవైఎం మండల అధ్యక్షుడిగా తొండాకూర్ గ్రామానికి చెందిన సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సోమవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

భవన నిర్మాణ పనులు ఆపాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని యోగేశ్వర కాలనీలో మినీ పార్కు కోసం కేటాయించిన స్థలంలో ఓ సంఘం సభ్యులు భవన నిర్మాణం చేపడుతున్నారని, ఆ పనులు వెంటనే నిలిపివేయాలని కాలనీ అధ్యక్షుడు ఎర్రయాదయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. అధికారులు స్పందించి భవనం పనులు నిలిపివేసి, మినీ పార్క్ ఏర్పాటు చేయాలని కోరారు.


నీటి విడుదల చేపట్టాలి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా వెంటనే నీటి విడుదల చేపట్టాలని కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు నర్సయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి నారు పోయుటకు కూడ నీరు లేదని లేదన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నీటి విడుదల చేపట్టాలని కోరారు.

రైతు భరోసా ఇప్పించాలి

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని 386 సర్వే నంబర్‌లోని సాగు భూములకు రైతు భరోసా ఇప్పించాలని రైతులు కోరారరు. ఈమేరకు వారు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. బద్దం రాజశేఖర్‌రెడ్డి, పురుషోత్తం, పెంట కిషన్, బుచ్చిమల్లయ్య, రమేష్‌గౌడ్, ధన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం వసంత టూల్స్ అండ్ క్రాఫ్ట్స్ యాజమాన్యం రూ. 2లక్షల విలువ చేసే 50 డ్యూయెల్ డెస్క్ బెంచీలను అందించినట్లు హెచ్ఎం కనక గంగాధర్ తెలిపారు. యజమాని దయానంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రం అందజేత



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ 21వ వార్డు లో జక్కుల సరోజకు ఇందిర మ్మ ఇల్లు మంజూరు కాగా సోమవారంమంజూరుపత్రాన్ని మాజీ కౌన్సిలర్ లిక్కి శంకర్ ఆమెకు అందజేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

27న అజ్మతే సహాబా అహితాబైత్ సమావేశం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో ఈ నెల 27న అజ్మతే సహాబా అహితాబైత్ సమావేశం నిర్వహించనున్నట్లు ముస్లిం కమిటీ అధ్యక్షుడు షౌకతుల్ బారి తెలిపారు. ఈమేరకు తగు భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం ముస్లిం కమిటీ సభ్యులు పోలీసులకు వినతిపత్రం అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పెర్కిట్(ఆర్మూర్): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆర్మూర్ మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బాదవాత్ రాజు నాయక్, ప్రధాన కార్యదర్శిగా కేలూత్ వీర్‌సింగ్ నాయక్, ఉపాధ్యక్షుడిగా దారవత్ మోహన్ నాయక్, అదనపు కార్యదర్శిగా సబావత్ రవీందర్ నాయక్, సాంస్కృతిక కార్యదర్శిగా జాదో బలిరాం నాయక్, కోశాధికారిగా నూనవత్ గంగాధర్ నాయక్ ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు కేలూత్ నరేందర్ నాయక్, గంగాధర్, శ్రీనివాస్, రాములు, గజన్‌లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

మాక్లూర్: మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన ఈర్నాల లక్ష్మి (11) అనే బాలిక అదృశ్యమైనట్లు సోమవారం మాక్లూర్ పోలీసులు తెలిపారు. లక్ష్మి తల్లి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఈక్రమంలో లక్ష్మి భిక్షాటనకు వెళ్లి తెలిసిన బంధువుల వద్ద వారం రోజులపాటు ఉండి వచ్చేది. కానీ ఏప్రిల్ 15న భిక్షాటనకు వెళ్లిన లక్ష్మి ఇంతవరకు తిరిగి రాలేదు. దీంతో బాలిక తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

నిధులు విడుదల చేయాలి



నిజామాబాద్‌అర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు విద్యార్థులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.